సాక్షి నంద్యాల

శుక్రవారం । 22 । మార్చి । 2024

I



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం టెంపుల్: నిత్యాన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్‌కు చెందిన బి. సాంబశివ రావు రూ.1,11,116 విరాళాన్ని ఆలయ ఏఈఓ ఫణీధర ప్రసాద్‌కు అందజేశారు.



వెండి వస్తువుల బహూకరణ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానానికి కృష్ణా జిల్లా అవనిగడ్డకు చెందిన వల్లభనేని రామరావు, కృష్ణకుమారి దంపతులు వెండి బిందె, ప్రమిదలు, ప్లేటు విరాళంగా సమర్పించారు.



ఆకట్టుకున్న కళా రూపం

శ్రీశైలం టెంపుల్: నిత్య కళావేదికపై కాకినాడకు చెందిన తోట బాలకృష్ణ, వారి బృందం రామాయణం – సుందరకాండపై నిర్వహించిన తోలుబొమ్మలాట భక్తులను ఆకట్టుకుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:33	ఉ॥ 4:56
ఆదోని	సా॥ 6:36	ఉ॥ 4:59
నంద్యాల	సా॥ 6:33	ఉ॥ 4:53
ఆత్మకూరు	సా॥ 6:31	ఉ॥ 4:54
బనగానపల్లె	సా॥ 6:34	ఉ॥ 4:54

హదీస్ వెలుగు :

రంజాన్ ఉపవాస దీక్ష పాటించేవారి పట్ల అల్లాహ్ అత్యంత కరుణ చూపుతారు. రోజా ఉన్న వారి కోసం సముద్రంలోని చేపలు సైతం దువా చేస్తాయి. – పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

24న అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నంద్యాలటౌన్: నంద్యాల నుంచి అరుణాచల క్షేత్రానికి ఈ నెల 24వ తేదీన ప్రత్యేక సూపర్ లగ్జరీ సర్వీసు ఏర్పాటు చేశామని నంద్యాల ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ మద్దిలేటి నాయుడు గురువారం తెలిపారు. ఈ సర్వీసు ఆదివారం ఉదయం 6 గంటలకు నంద్యాల నుంచి బయలుదేరి కాణిపాకం మీదుగా రాత్రికి అరుణాచలం చేరుకుంటుందన్నారు. మరుసటి రోజు సోమవారం సాయంత్రం అరుణాచలం నుంచి బస్సు బయలుదేరి వేలూరు మీదుగా నంద్యాల చేరుకుంటుందన్నారు. కాణిపాకం, వేలూరు స్వర్ణదేవాలయాల్లో ప్రయాణికులు, భక్తులు దర్శనం చేసుకోవడానికి వీలుగా బస్సును ఆయా క్షేత్రాల్లో నిలుపుతామన్నారు. ఈ సర్వీసుకు చెందిన టికెట్లను బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్, apsrtconline.inలో బుక్ చేసుకోవచ్చని సూచించారు.

87 శాతం లక్ష్యం పూర్తి

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ మార్కెట్ యార్డులకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని 87 శాతం అధిగమించినట్లు జిల్లా అగ్రిట్రేడింగ్ అండ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహిమాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం రూ.25.50 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.22.25 కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో నంద్యాల మార్కెట్‌యార్డుకు సంబంధించి రూ.7.50 కోట్లకు గాను రూ.5.14 కోట్లు, ఆళ్లగడ్డ రూ.4.95 కోట్లకు గాను రూ.4.98 కోట్లు, డోన్ రూ.1.20 కోట్లకు గాను రూ.1.18 కోట్లు, నందికొట్కూరు రూ.4 కోట్లకు రూ.3.16 కోట్లు, ఆత్మకూరు రూ.4.40 కోట్లకు గాను రూ.4.97 కోట్లు, బనగానపల్లె రూ.95 లక్షలకు గాను రూ.86.07 లక్షలు, కోవెలకుంట్ల రూ.1.25 కోట్లకు గాను రూ.74.48 లక్షలు, పాణ్యం రూ.1.25 కోట్లకు గాను రూ.1.19 కోట్లు వసూలైనట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో పన్ను వసూళ్లు చాలా వరకు తగ్గినట్లు ఆయన తెలిపారు.

గిరిజన గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలంలోని గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల (బాలుర)లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో ఖాళీగా ఉన్న 8వ తరగతి, ఇంటర్మీడియెట్ ఎంపీసీ, బైపీసీలలో చేరగోరే విద్యార్థులు ప్రవేశ పరీక్ష కోసం www. aptwgurukulam.ap.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గుంటూరు, బాపట్ల, ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ కడప, నంద్యాల, కర్నూలు, తిరుపతి, చిత్తూరు, శ్రీసత్యసాయి, అన్నమయ్య, అనంతపురం జిల్లాలకు చెందిన విద్యార్థులు మాత్రమే అర్హులని పీఓ తెలిపారు. 8వ తరగతిలో 45, జూనియర్ ఇంటర్ ఎంపీసీలో 45, బైపీసీలో 45 సీట్లు ఖాళీ ఉన్నాయన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.లక్ష ఉన్నవారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 7వ తేదీన ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 9885670106, 8099172737, 9177819676 లను సంప్రదించాలన్నారు.

చెప్పాడంటే.. చేస్తాడంతే!

- ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి సంక్షేమ భరోసా
- పేద కుటుంబాలను ఆదుకున్న జగనన్న పథకాలు
- 129 హామీల్లో 99 శాతం అమలు
- ప్రభుత్వ సహాయాన్ని ప్రతి ఇంటా వివరించిన వైనం
- గడప గడపకూ జగనన్న లేఖ
- జిల్లాలో 5.56 లక్షల కుటుంబాలకు అందజేత

'కులం చూడం.. మతం చూడం.. పార్టీలు అంతకన్నా చూడం. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాం' అంటూ ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇళ్లకు నవరత్నాలను తీసుకెళ్లారు. ప్రతి పేదింటికి పెద్దన్నగా అండగా నిలిచి పేదరికాన్ని పారదోలారు. డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్స్ ట్రాన్స్‌ఫర్) ద్వారా లబ్ధిదారులకు సంక్షేమ పథకాల మొత్తం బ్యాంక్‌లో జమ అయ్యేటట్లు చేశారు. జగనన్న పాలనలో పేద, మధ్య తరగతి కుటుంబాల బతుకు చిత్రాలు మారిపోయాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను 'గడప గడపకు జగనన్న సంక్షేమ సందేశం' పేరుతో అందజేస్తున్నారు. లేఖలు అందుకున్న లబ్ధిదారులు 'సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పాడంటే చేస్తాడంతే' అంటూ కొనియాడుతున్నారు.

కోవెలకుంట్ల: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారు. పాదయాత్ర సమయంలో ప్రజల కష్ట, నష్టాలను స్వయంగా తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు నవరత్న పథకాలు అమలు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని మరెన్నో హామీలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. వైఎస్సార్‌సీపీ 58 నెలల పాలనలో నవరత్నాలతోపాటు మరిన్ని పథకాలు అందించి ఆర్థిక భరోసా కల్పించి వారికి అండగా నిలిచారు. ప్రతి కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ. 6 లక్షలకు వరకు లబ్ధి చేకూరింది. ఈ మేరకు ప్రతి కుటుంబానికి ప్రభుత్వ లబ్ధిని వివరించేందుకు రెండు పేజీలతో కూడిన గడప గడపకు సంక్షేమ లేఖలను ప్రతి ఇంటికి అందజేశారు. జిల్లాలోని 29 మండలాల పరిధిలో 5.56 లక్షల కుటుంబాలకు 'చెప్పాడంటే చేస్తాడంతే' పేరిట సందేశ లేఖలు చేరాయి. ఎన్నికల ముందు ఇచ్చిన 129 హామీల్లో 99 శాతం నెరవేర్చారు. ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధికి సంబంధించి గడపగడపకు సంక్షేమం పేరిట సీఎం స్వయంగా రాసిన లేఖ సందేశాన్ని అందజేశారు. ఈ లేఖలో ఆయా కుటుంబాలకు పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని పొందుపరిచారు. నంద్యాల జిల్లాలో 5.56 లక్షల కుటుంబాలకు వివిధ పథకాలతో ఆర్థిక లబ్ధి చేకూరింది. వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ చేయూత, ఆసరా, జగనన్న అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన, సున్నావడ్డీ రుణాలు, పంటల బీమా, డ్వాక్రా మహిళలకు సున్నావడ్డీ, కల్యాణమస్తు వంటి పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ అయింది. సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి రూ. లక్ష నుంచి రూ. 6 లక్షలకు పైగా లబ్ధి చేకూరడంతో ఆయా కుటుంబాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమ పథకాలతో పాటు జిల్లాలో అర్హత ఉన్న 48 వేల కుటుంబాలకు ఇంటి స్థలంతో పాటు పక్కాగృహం మంజూరు చేయడంతో సొంతింటి కల నెరవేర్చుకున్నారు. లేఖలో సీఎం జగన్ సందేశంతోపాటు నాడు– నేడు కార్యక్రమం ద్వారా పాఠశాలలు, అనుపత్రుల అభివృద్ధి, ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచడం, 3,257 చికిత్సలను ఆరోగ్యశ్రీలో చేర్చడం, సచివాలయ వ్యవస్థ, రైతు భరోసా కేంద్రాలు, ఫ్యామిలీ డాక్టర్, గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణం, తదితర వివరాలను పొందుపరిచారు. 'మీ బిడ్డ పాలనలో మీ ఇంటిలో మంచి జరిగి ఉంటే మీ బిడ్డను మరలా ఆశీర్వదించండి' అని లేఖలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.



కోవెలకుంట్లలో జగనన్న సంక్షేమ సందేశం లేఖలు అందుకున్న లబ్ధిదారులు

రూ. 4.14 లక్షల మేర లబ్ధి చేకూరింది



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు చాలా బాగున్నాయి. పింఛన్ కానుక పథకం కింద గడిచిన ఐదేళ్లలో నాకు రూ. 1.35 లక్షలు, నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా రూ. 2 లక్షలు విలువ చేసే ఇంటిస్థలం ఇచ్చారు. పక్కాగృహ నిర్మాణానికి ఇప్పటి వరకు రూ. 78 వేలు, కరోనా కాలంలో రూ. వెయ్యి కోవిడ్ సాయమందింది. ఐదేళ్లకాలంలో రూ. 4.14 లక్షల మేర లబ్ధి చేకూరింది. కొన్ని నెలల క్రితం పెరాలసిస్ రావడంతో మంచానికే పరిమితమయ్యాను. అయినా భయం లేదు. ప్రభుత్వం ఆదుకుంటుందనే ధైర్యం ఉంది. – మంజుల లక్ష్మమ్మ, సంతపేట, కోవెలకుంట్ల

ప్రభుత్వ సాయం మరువలేం



కష్టకాలంలో ఉన్న పేద కుటుంబాలకు ప్రభుత్వం చేదోడువాదోడుగా నిలిచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికసాయం అందించింది. వివిధ పథకాల ద్వారా నాలాంటి వేలాది కుటుంబాలు బాగుపడ్డాయి. ఎలాంటి లంచాలకు తావులేకుండా నేరుగా మా బ్యాంకు ఖాతాల్లో నగదు జమచేశారు. ఐదేళ్లకాలంలో అందిన సంక్షేమ పథకాల వివరాల లేఖను ఇటీవలే నాకు అందించారు. – లక్ష్మమ్మ, లబ్ధిదారురాలు, కోవెలకుంట్ల

జిల్లాలో సంక్షేమ పథకాలతో లబ్ధి పొందిన కుటుంబాల వివరాలు

నియోజకవర్గం	లబ్ధి పొందిన కుటుంబాలు
బనగానపల్లె	91,941
నంద్యాల	92,149
ఆళ్లగడ్డ	94,256
శ్రీశైలం	75,149
నందికొట్కూరు	86,442
డోన్	86,535
పాణ్యం	29,637

(పాణ్యం గడివేముల)

పేదింట నవరత్నాల వెలుగులు

- ఐదేళ్లలో ఒక కుటుంబానికి రూ.8.66 లక్షల లబ్ధి

కొలిమిగుండ్ల: 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో సంక్షేమ వెలుగులతో పేదరికం నుంచి ఈ కుటుంబం బయటపడింది. కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లెకు చెందిన శ్రీనివాసులు స్థానికంగా నాపరాతి గనుల్లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలతో పాటు వృద్ధాప్యంలోని తల్లిదండ్రులు, దివ్యాంగురాలైన చెల్లెలు ఉన్నారు. కుటుంబ పోషణ అంతా అతనిదే. పేదరికంతో కొన్నేళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి చిన్న అవసరానికి అప్పు చేయాల్సి వచ్చేది. అయితే ఐదేళ్ల క్రితం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ పేదింట నవరత్నాల వెలుగులు విరజిమ్మాయి. మండలంలోనే అత్యధికంగా శ్రీనివాసులు కుటుంబానికి డీబీటీ రూపంలో రూ.6,66,235 లబ్ధిచేకూరింది. వీటికి తోడు తుమ్మలపెంట సమీపంలోని జగనన్న కాలనీలో రూ.2 లక్షల విలువ చేసే ఇంటి స్థలాన్ని ఇవ్వడంతో మొత్తంగా రూ.8,66 లక్షల లబ్ధి జరిగింది. శ్రీనివాసులు సోదరి సుబ్బమ్మ పుట్టుకతోనే దివ్యాంగురాలు. దీంతో ఆమెకు దివ్యాంగ పింఛన్ కింద రూ.3వేలు వస్తోంది. తండ్రి కొండన్న పక్షవాతంతో మంచానికే పరిమితం కావడంతో ప్రభుత్వం రూ.5 వేలు పింఛన్ అందిస్తోంది. ఇద్దరికి పింఛన్ రూపంలోనే నెలకు రూ.8 వేలు మంజూరవుతోంది. ఇద్దరికి పింఛన్ సొమ్ము ఇప్పటి వరకు రూ.4.32 లక్షలు ఆ ఇంటికి చేరింది. శ్రీనివాసులు కూతురు పుట్టిన 40 రోజుల్లోనే అనారోగ్య సమస్య ఏర్పడంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.1.14 లక్షలు ఖర్చు చేసి ఉచితంగా ఆపరేషన్ చేశారు. వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.80,500, పెద్ద కుమార్తెకు అమ్మ ఒడి పథకం కింద రూ.59 వేలు, వైఎస్సార్ ఆసరా కింద 22,916, సున్నా వడ్డీ కింద రూ. 6,141, వైఎస్‌ఆర్ ఆరోగ్యశ్రీ ఆసరా కింద రూ. 12,375 అందింది. కోవిడ్ సాయం పథకాల ద్వారా కూడా లబ్ధి జరిగింది. 'సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో మాలాంటి పేదోళ్లు చాలా మంది ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడ్డారు. ఈ పథకాలు లేకుంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. గతంలో టీడీపీ ప్రభుత్వంలో ఒక్క పథకం కూడా మా దరిచేరలేదు. మా కుటుంబం అంతా సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటాం' అంటూ శ్రీనివాసులు కుటుంబీకులు చెబుతున్నారు.



శ్రీనివాసులు కుటుంబ సభ్యులు



సంక్షేమ పథకాల పత్రాన్ని చూపుతున్న శ్రీనివాసులు సోదరి దివ్యాంగురాలు సుబ్బమ్మ

సమ్మోహనం.. జగన్మోహిని రూపం

- మోహినీ అలంకరణలో సింహరూపుడు
- శరభ వాహనంపై దర్శనమిచ్చిన స్వామి
- ఎగువ అహోబిలంలో పొన్నచెట్టు వాహన సేవ







పొన్నచెట్టు వాహనంపై జ్వాల నృసింహస్వామి, మోహినీ అలంకరణలో శ్రీ ప్రహ్లదవరదస్వామి, దిగువ అహోబిలంలో శరభ వాహన సేవ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: అమృతం అసురులపాలు కాకుండా లోక సంరక్షణ కోసం మహావిష్ణువు దాల్చిన జగన్మోహిని అలంకారంలో అహోబిల నృసింహుడు వాడ వాడల్లో సంచరిస్తూ.. భక్తులకు కనువిందు చేశారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన గురువారం సింహరూపుడైన స్వామిని జగన్మోహినీ అలంకరణతో గడగడపకు (భక్తుని చెంతకే భగవంతుడు) తీసుకెళ్లారు. వేకువజామున నిత్య పూజల్లో భాగంగా సుప్రభాతసేవతో స్వామి అమ్మవార్లను మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరద స్వామిని యాగశాలలో కొలువుంచి నవకలశ స్థాపన గావించారు. అనంతరం ఉత్సవమూర్తి శ్రీ ప్రహ్లాదవరదుడిని నూతన పట్టుపీతాంబరాలతో మోహినీ రూపంలో అలంకరించారు. పల్లకీలో స్వామి వారిని కొలువుంచి భక్తుల గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య వాడవాడలా తిప్పారు. సర్వాలంకార భూసితుడైన ప్రహ్లాదవరదుడిని దర్శించుకుని భక్తులు కర్పూర నీరజనాలు అర్పించారు. రాత్రి శ్రీ ప్రహ్లాదరవదస్వామి శరభ వాహనంపై కొలువై భక్తులకు దర్శనమిచ్చారు. శరభ వాహనంపై కొలువైన స్వామి మాడవీధుల్లో విహరించారు.



పల్లకీలో ఊరేగుతున్న మోహనరూపుడు

ఎగువ అహోబిలంలో..

అహోబిలేశుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన గురువారం ఎగువ అహోబిలంలో శ్రీ జ్వాలనృసింహ స్వామి పొన్నచెట్టు వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవమూర్తులకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పుష్పాలతో అలంకరించిన పల్లకీలో కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి శ్రీ జ్వాల నృసింహస్వామిని పొన్నచెట్టు వాహనంపై కొలువుంచి వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

నేటి కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిలంలో శుక్రవారం ఉదయం అభిషేకం, సాయంత్రం గజవాహన సేవ, రాత్రి తిరు కల్యాణోత్సవం ఉంటుంది. దిగువ అహోబిలంలో ఉదయం వేణుగోపాల స్వామి అలంకారం, రాత్రి పొన్నచెట్టు వాహనంపై స్వామి విహరిస్తారు.

ఈవీఎంలపై అవగాహన అవసరం

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు ఈవీఎం పనితీరుపై పోలింగ్ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో ఈవీఎంల పనితీరుపై జిల్లా, నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, డీఆర్‌ఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజు ఈవీఎంల పనితీరుపై సమస్యలు తలెత్తకుండా పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ నివ్వాలని జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లను కోరారు. బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌ల పనితీరుపై సంపూర్ణ శిక్షణ పొందాలన్నారు. ఈవీఎం మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి ఏ చిన్న సందేహం ఉన్నా, అడిగి తెలుసుకుని నియోజకవర్గ స్థాయిలో పోలింగ్, సహాయ పోలింగ్ అధికారులకు శిక్షణ ఇనివ్వాలన్నారు. ఈవీఎంలలో తరచూ వచ్చే తప్పిదాలపై పూర్తిస్థాయి దృష్టి సారించి ఒకటికి రెండు సార్లు అడిగి తెలుసుకుని శిక్షణనిచ్చేందుకు సన్నద్ధం కావాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించిన అనంతరం తప్పనిసరిగా ఇన్ఫర్మేషన్ మొత్తం క్లియర్ చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను మొదటి రాండమైజేషన్ పద్ధతిలో అసెంబ్లీ నియోజకవర్గాలకు, రెండవ రాండమైజేషన్ పద్ధతిలో పోలింగ్ కేంద్రాలకు కేటాయిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పోలింగ్ రోజున ఈవీఎంల పనితీరుపై సెక్టోరల్ అధికారులు, పోలింగ్ అధికారులకు సరైన అవగాహన లేకపోతే సమస్యలు వస్తాయని స్పష్టం చేశారు. ఈవీఎంల పనితీరుపై ఉన్న భయాన్ని వీడి అవగాహన పెంపొందించుకొనేలా పోలింగ్ అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఈవీఎంలోని విభాగాలు పనితీరును స్పష్టంగా తెలుసుకోవాలన్నారు. అనంతరం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కామేశ్వరరావు ఈవీఎంల పనితీరుపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు శిక్షణకు హాజరైన ప్రతి ఒక్కరి చేత ఆపరేట్ చేయించి శిక్షణ ఇచ్చారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీనివాసులు

క్వింటా వాము రూ.33,333

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో వాముకు డిమాండ్ పెరిగింది. గురువారం యార్డుకు 225 మంది రైతులు 763 క్వింటాళ్ల వాము తీసుకొచ్చారు. కర్నూలు, అనంతపురం, మహబూబ్‌నగర్, కర్ణాటక నుంచి వాము వస్తోంది. నాణ్యతను బట్టి కనిష్టంగా రూ.1,169, గరిష్టంగా రూ.33,333 ధర లభించగా.. సగటు ధర రూ.22,642 నమోదైంది. కందులు, మినుముల ధర నిలకడగా ఉంటోంది. మార్కెట్‌కు కందులు 94 మంది రైతులు 309 క్వింటాళ్లు తీసుకురాగా.. కనిష్ట ధర రూ.2,090, గరిష్ట ధర రూ.9,861, సగటు ధర రూ.9,770 లభించింది. మినుములు 45 క్వింటాళ్లు రాగా.. కనిష్ట ధర రూ.7,501, గరిష్ట ధర రూ.9,089, సగటు ధర రూ.9069 పలికింది. మొక్కజొన్న క్వింటాకు రూ.2,124 ప్రకారం ధర లభించడం విశేషం.

యువతా మేలుకో... ఓటరుగా దరఖాస్తు చేసుకో

- దరఖాస్తుకు ఏప్రిల్ 15 చివరి తేదీ

సాక్షి, నంద్యాల: సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. మరో 50 రోజుల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల్లో ఓటు వేసి మీకు ఇష్టమైన నేతను ఎన్నుకోవచ్చు. ఎన్నికల రోజు ఓటు వేయాలి అంటే ముందుగా మీరు ఓటరుగా నమోదు చేసుకుని ఉండాలి. ఓటరుగా నమోదు చేసుకుని ఉన్నా తుది ఓటరు జాబితాలో మీ పేరు లేకుంటే ఓటు వేసేందుకు అనర్హులు. ఇలాంటి వారి కోసమే కేంద్ర ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. తుది ఓటరు జాబితాలో పేరు లేని వారు.. ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. అర్హులైన వారు ఏప్రిల్ 15వ తేదీలోపు ఓటరుగా దరఖాస్తు చేసుకుంటే సంబంధిత అధికారులు దరఖాస్తుదారుల వివరాలను పరిశీలించి, అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరును చేరుస్తారు.



ఆన్‌లైన్‌లో...

ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. 'రిజిస్టర్ యాజ్ ఏ న్యూ ఓటర్' పై క్లిక్ చేస్తే ఫాం–6 దరఖాస్తు వస్తుంది. అక్కడే దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని, దాన్ని పూర్తి చేయాలి. తర్వాత మీ ఫోన్ నంబర్‌కు రెఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. దాని ఆధారంగా అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ స్టేటస్‌ను ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాల ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి మీ వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో మీ పేరు చేరుస్తారు. అలాగే హెచ్‌టీటీపీఎస్//ఓటర్ పోర్టల్.ఈసీఐ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి మీ ఫోన్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకోవాలి. లాగిన్ అయ్యాక వెబ్‌సైట్‌లో న్యూ ఓటర్ రిజిస్ట్రేషన్‌లోకి వెళ్లి వివరాలు పొందుపరిస్తే నిర్ధారించుకున్నాక మీ పేరు ఓటరు జాబితాలో చేరుస్తారు. మొబైల్‌లో ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆఫ్‌లైన్‌లో ఇలా...

18 ఏళ్లు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే ఆఫ్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్‌వో)లకు మీరు నేరుగా ఫాం–6 దరఖాస్తును అందజేయొచ్చు. మండల స్థాయిలో అయితే తహసీల్దార్ కార్యాలయాల్లో కొత్త ఓటరు కోసం పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయొచ్చు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత మాత్రమే మీ పేరును ఓటరు జాబితాలో చేరుస్తారు. ఓటు హక్కు ఎలా చేసుకోవాలి లేదా ఇంకేమైనా సందేహాలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1950కి ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చు.

ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం

- వయో వృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు (అర్బన్): ప్రస్తుతం జరగబోయే ఎన్నికల్లో వయో వృద్ధులు, దివ్యాంగులకు తొలిసారిగా ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును భారత ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చిందని వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా గురువారం తెలిపారు. 85 ఏళ్లు పైబడినవారు, 40 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్న వారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చని ఆమె పేర్కొన్నారు. పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారని, నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తెస్తారని తెలిపారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వయోవృద్ధులు, దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకోసం ఫారం 12డి నింపి రిటర్నింగ్ అధికారికి గాని, సహాయ రిటర్నింగ్ అధికారికి గాని పంపించాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబర్ పొందుపరచాలని చెప్పారు. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. దరఖాస్తులను అందుకున్న తర్వాత సంబంధిత దరఖాస్తుదారుల ఇళ్లకు బూత్‌స్థాయి అధికారులు వెళ్తారని, అర్హతలను బట్టి ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయం కల్పించాలా వద్దా అనేది నిర్ణయిస్తారని పేర్కొన్నారు. అనంతరం పూర్తి చేసిన ఫారం 12డీని రిటర్నింగ్ అధికారికి అందజేస్తారన్నారు. అర్హత ఉంటే దరఖాస్తుదారుల ఇంటికి అధికారులే వెళ్లి ఓటు వేయిస్తారని చెప్పారు.

జీవితంపై విరక్తితో ఆత్మహత్య

ఎమ్మిగనూరురూరల్: అనారోగ్యంతో భార్య మృతి చెందింది.. మరో మహిళను భాగస్వామిగా ఎంచుకుంటే ఆమె తనను కాదని వెళ్లిపోయింది. దీంతో జీవితంపై విరక్తి చెంది దైవందిన్నె గ్రామానికి చెందిన బోయ వీరస్వామి(33) గురువారం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వీరస్వామికి భార్య రాధక్క, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కొన్ని నెలల కిత్రం తిరుపతికి భార్యభర్తలు వలస వెళ్లారు. మూడు నెలల క్రితం రాధక్క అనారోగ్యంతో తిరుపతిలో మృతి చెందింది. వీరస్వామికి పెళ్లి కాక ముందు దైవందిన్నె గ్రామానికి చెందిన ఓ వివాహితతో ప్రేమ వ్యవహారం ఉంది. భార్య మృతి చెందటంతో తాను ప్రేమించిన వివాహితను తీసుకొని కొన్ని రోజుల క్రితం కదిరి మండలం డి.కొత్తపల్లికి తీసుకెళ్లాడు. తన భార్యను తీసుకెళ్లాడని వీరస్వామిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు కేసు పెట్టాడు. పోలీసులు మహిళకు కౌన్సెలింగ్ ఇవ్వటంతో ఆమె భర్తతో వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన వీరస్వామి గురువారం గ్రామ సమీపంలోని పొలంలో వేప చెట్టుకు లుంగీతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు విషయాన్ని రూరల్ పోలీసులకు తెలిపారు. సంఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లి మూడు నెలల క్రితం, ప్రస్తుతం తండ్రి మృతిచెందడంతో ముగ్గురు పిల్లలు అనాథలుగా మిగిలిపోయారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు విలేకరులకు తెలిపారు.

పోలీసులను ఆశ్రయించిన యువతి

వెల్దుర్తి(కృష్ణగిరి): బ్రహ్మగుండం క్షేత్రంలో రామళ్లకోటకు చెందిన యువకుడి పెళ్లి బుధవారం పీటలపై ఆగిపోయిన విషయం తెలిసిందే. పెళ్లి ఆగేందుకు కారణమైన విశాఖపట్టణానికి చెందిన యువతి గురువారం స్థానిక పోలీసులను ఆశ్రయించింది. తనతో సహజీవనం చేస్తూ, మరో పెళ్లికి సిద్ధపడి తనను మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డికి ఆమె ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ సూచన మేరకు తగిన ఆధారాలతో తనను మోసం చేసిన యువకుడిపై విశాఖపట్టణంలో ఫిర్యాదు చేయనున్నట్లు తెలుపుతూ ఆమె వెళ్లిపోయింది.

పాముకాటుతో రైతు మృతి



శ్రీనివాసులు(ఫైల్)

తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలిలో కోతిరాళ్ల శ్రీనివాసులు(34) అనే రైతు పాముకాటుతో గురువారం మృతి చెందాడు. గ్రామంలోని వామి దొడ్డిలో వేరుశనగ మేత, జొన్న సొప్ప కలిపి వా మి వేసే పనిలో నిమగ్నమై ఉండగా..పక్కనున్న రాతిగోడలో నుంచి వచ్చిన నాగుపాము కాలికి కాటు వేయడంతో కేకలువేశాడు. సమీపంలోనే ఉన్న కుటుంబ సభ్యులు శ్రీనివాసులును చికిత్స నిమిత్తం పత్తికొండకు తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందారు. శ్రీనివాసులు పెద్ద కుమారుడు ఆరేళ్ల వయసున్న ప్రదీప్ కూడా మూడేళ్ల క్రితం పాముకాటుకు గురై మృతి చెందాడు. మూడేళ్లలో తండ్రీ కొడుకులిద్దరూ పాముకాటుకు గురై మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది. శ్రీనివాసులుకు భార్య సుధారాణి, కుమారుడు ఆదిత్యకుమార్ ఉన్నారు.

మార్కెట్ ఫీజు వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

కర్నూలు(అగ్రికల్చర్): మార్కెటింగ్ శాఖ అధికారులు మార్కెట్ ఫీజు వసూళ్లపై దృష్టి సారించారు. 2023–24 ఆర్థిక సంవత్సరం ఈ నెల చివరితో ముగియనుంది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయ, విక్రయాలపై వ్యాపారులు మార్కెట్ కమిటీలకు 1 శాతం ఫీజు చెల్లించాల్సి ఉంది. 2023–24లో దాదాపు రూ.31 కోట్ల ఫీజు వసూలు చేయాలనేది లక్ష్యం. మార్చి నెలలో ఫీజు వసూలు కోసం స్పెషల్ డ్రైవ్ చేపట్టడం వల్ల శుక్రవారం నాటికి లక్ష్యం మేరకు ఫీజు రూ.31 కోట్లు వసూలైంది. ఆర్థిక సంవత్సరం ఇంకా 10 రోజులు ఉన్నందున స్పెషల్ డ్రైవ్ చేపట్టడం ద్వారా ఫీజు వసూలులో లక్ష్యాలను అధిగమించే అవకాశం ఉందని మార్కెటింగ్ శాఖ అసిస్టెంటు డైరెక్టర్ నారాయణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

వేసవిలో ‘పవర్’ ఫుల్!

- 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు చర్యలు
- సబ్‌స్టేషన్‌ల సామర్థ్యం పెంపు
- ఓవర్‌లోడ్‌ను అధిగమించేందుకు ఎలక్ట్రికల్ టవర్లు
- డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ సరఫరా

కర్నూలు(అగ్రికల్చర్): వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. డిమాండ్‌కు తగినట్లు 24 గంటలు నాణ్యమై విద్యుత్ సరఫరా చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. వేసవికి తోడు సార్వత్రిక ఎన్నికలు కూడా జరుగుతుండటంతో నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. దీనికి తోడు విద్యుత్ పొదుపుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. 2019–20 నుంచి జిల్లాలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు గణనీయంగా పెరిగాయి. ఎంఎస్‌ఎంఈ కింద పరిశ్రమలు విస్తరించాయి. దీంతో డిమాండ్ పెరిగింది. ఈ పరిస్థితులలో 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వడం సాధ్యం కాదు. అయితే ప్రభుత్వం తీసుకున్న చర్యలతో డిమాండ్‌కు తగినట్లు అధికారులు విద్యుత్ ఇస్తున్నారు.

500 మిలియన్ యూనిట్లకు పెరగనున్న వినియోగం!

2023 ఏప్రిల్ నెలలో విద్యుత్ వినియోగం 395 మిలియన్ యూనిట్లు, మే నెలలో 388 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం ఉంది. ఈ సారి వేసవి తీవ్రతకు తోడు సార్వత్రిక ఎన్నికలు కూడా జరుగుతుండటంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో విద్యుత్ వినియోగం 500 మిలియన్ యూనిట్లు దాటే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. ఈ డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ ఇచ్చేందుకు రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 6,98,175, నంద్యాల జిల్లాలో 7,57,045 ప్రకారం మొత్తం 14,55,220 విద్యుత్ సర్వీస్‌లు ఉన్నాయి. వీటికి అదనంగా కర్నూలు జిల్లాలో 420, నంద్యాల జిల్లాలో 282 ప్రకారం... మొత్తం 702 హెచ్‌టీ సర్వీస్‌లు ఉన్నాయి. మొత్తం సర్వీస్‌లకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

సబ్‌స్టేషన్ల సామర్థ్యం పెంపు పనులు

24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలంటే సబ్‌స్టేషన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపుతప్పనిసరి. కొద్ది వారాలుగా సామర్థ్యం పెంచే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏపీఎస్‌పీడీసీఎల్, ఏపీ ట్రాన్స్‌కో ఈ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతోంది. 23 విద్యుత్ సబ్ స్టేషన్‌లలో సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకు పెంచే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇందుకోసం ఒక్కో సబ్ స్టేషన్‌లో రూ.2.20 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మరో 12 సబ్ స్టేషన్‌ల సామర్థ్యాన్ని అడిషినల్‌గా 5 ఎంవీఏ పెంచుతున్నారు. ఇందుకు ఒక్కో సబ్ స్టేషన్‌కు రూ.కోటి వరకు ఖర్చు చేస్తున్నారు.



కర్నూలులోని 133 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్

- కర్నూలు కార్బైడ్ ఫ్యాక్టరీ 220/133 కేవీ సబ్ స్టేషన్‌కు అనుబంధంగా నందికొట్కూరు, మాధవరం, ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలుల్లో 133/33 కేవీ సబ్‌స్టేషన్‌లు ఉన్నాయి. ప్రస్తుతం వీటి సామర్థ్యం 16.5 ఎంవీఏ ఉండగా.. 31.5 ఎంవీఏకు పెంచే పనులు చురుగ్గా జరుగుతున్నాయి.
- కార్బైడ్ ఫ్యాక్టరీలోని 220/133 కేవీ సబ్ స్టేషన్ సామర్థ్యం ప్రస్తుతం 160 ఎంవీఏ ఉంది. దీనిని 580 ఎంవీఏ సామర్థ్యానికి పెంచడానికి ఏపీ ట్రాన్స్‌కో చర్యలు చేపట్టింది. ఇందుకు తగ్గట్టుగా లైన్‌లు వేయడం, కండక్టర్‌లు మార్చడం వంటి పనులు శరవేగంగా జరుగుతున్నాయి.
- గూడూరులోని 133/33 కేవీ సబ్ స్టేషన్‌కు 31 కిలో మీటర్ల మేర 90 మెగా వాట్ల కండక్టర్‌తో లైన్ ఆధునీకరిస్తున్నారు.
- కర్నూలు నగరంలో 33 కేవీ ఫీడర్‌లు ఓవర్‌లోడ్‌తో ఉంటున్నాయి. ఈ సమస్యను అధిగమించేందుకు 33 కేవీ లైన్‌లను బైఫర్‌కేషన్ చేసే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందుకోసం నగరంలో 50 వరకు ఎలక్ట్రికల్ టవర్‌లు ఏర్పాటు అవుతున్నాయి. ఇప్పటికే చాలా వరకు టవర్‌లను నెలకొల్పే పనులు జరిగాయి.

పొదుపు పాటిద్దాం..



కర్నూలులో ఏర్పాటు చేస్తున్న ఎలక్ట్రికల్ టవర్

విద్యుత్ పొదుపుపై అధికారులు దృష్టి సారించారు. గృహాలకు వినియోగించే విద్యుత్‌లో 10 నుంచి 20 శాతం దుర్వినియోగం ఉంటుంది. ఈ దుర్వినియోగాన్ని నివారిస్తే రోజుకు వేలాది యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుంది. వేసవిలో ఏసీల వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఏసీలను 25 డిగ్రీల దగ్గర పెట్టుకోవాలి. అవసరం లేనపుడు ఏసీలను బంద్ చేసుకోవాలి. పగటి పూట లైట్లు వేయకపోవడం మంచిది. నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవసరమైనప్పుడే లైట్లు , ఫ్యాన్‌లు వేసుకోవాలి. ఈ అంశాలపై విద్యుత్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

అనధికారిక విద్యుత్ కోతలు ఉండవు



వేసవిలో గృహ విద్యుత్ వినియోగం దాదాపు రెట్టింపు అవుతోంది. వేసవికి తోడు ఎన్నికలు జరుగుతుండటంతో విద్యుత్ వినియోగం మరింత పెరిగే అవకాశం ఉంది. డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేశాం. గతంలో వేసవి వచ్చిందంటే అనధికార కోతలు ఉండేది. ఈ వేసవిలో అలాంటి ఏమీ వుండవు. 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ఇచ్చేందుకు పనులు చేపడుతున్నాం. విద్యుత్ పొదుపుపై కూడా దృష్టి సారించాం.

– ఎం.ఉమాపతి, ఎస్‌ఈ, విద్యుత్ శాఖ, ఉమ్మడి కర్నూలు జిల్లా

‘హత్యా రాజకీయాలకు దూరం’

చాగలమర్రి: హత్యా రాజకీయాలకు దివంగత నేత మహబూబ్‌వలీ కుటుంబం దూరంగా ఉంటుందని జిల్లా వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్.బాబూలాల్, ఎంపీపీ వీరభద్రుడు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 18న చాగలమర్రిలో పంచాయతీ వేలం పాటలో డిపాజిట్‌దారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుని క్షణికావేశంలో ఓ యువకుడి హత్యకు గురైతే టీడీపీ నాయకులు రాజకీయరంగు పులిమి లబ్ధిపొందాలనుకోవడం అవివేకమన్నారు. 1992 ఎంపీపీ ఎన్నికలలో చాగలమర్రిలో టీడీపీ నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడితే తాము శాంతియు తంగా నిరసనగా ర్యాలీ నిర్వహిస్తుండగా బాంబులు ఎవరి ఇంటి మీది నుంచి ఎవరు వేశారో ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. 2001 ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి గోడలపై వాల్‌పెయింట్ వేయకుండా దౌర్జన్యం చేసింది ఎవరో స్థానిక టీడీపీ నాయకులు సమాధానం చెప్పాలన్నారు. తమ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ ప్రజలందరూ కూడా ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారన్నారు. గొడవలు, ఘర్షణలను తాము ప్రోత్సహించబోమన్నారు. చాగలమర్రిలో హత్య జరిగిన రోజు బైక్‌లపై కత్తులు పట్టుకుని స్వైర విహారం ఎవరో చేశారో పోలీసుల దర్యాప్తులో తేలుతుందన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, సర్పంచ్ గోవిందయ్య, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జి.గణేష్‌రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, యువజన అధ్యక్షుడు వి.మహబూబ్ షరీఫ్, ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫీ, వార్డు మెంబర్లు ముల్లా బురాందీన్, అబ్దుల్లా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముల్లా జాబీర్, గేట్ల మాబుసాబ్, సుబ్బారాయుడు, రమణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టీడీపీ నాయకుల దుశ్చర్య

- మంచినీటి సరఫరా జరగకుండా స్టార్టర్ ధ్వంసం

కొలిమిగుండ్ల: ప్రజలకు మంచి పని చేసినా టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారు. మండల పరిధిలోని మీర్జాపురంలో గురువారం మంచినీటి పథకానికి చెందిన స్టార్టర్, గేట్‌వాల్, పైపులైన్‌ను టీడీపీ నాయకులు ధ్వంసం చేశారని గ్రామ సర్పంచ్ లాయర్ మహేశ్వరెడ్డి ఆరోపించారు. దశాబ్దాలుగా గ్రామస్తులు మంచినీటికి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి రూ.50 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్, గ్రౌండ్ లెవల్ సంప్ ఏర్పాటు చేసి ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి నీటి సరఫరా చేస్తున్నారు. గ్రామంలో నీటి సమస్య తీరడంతో ప్రజల ఇబ్బందులు తొలగిపోయాయి. ఇది ఓర్వలేని టీడీపీ నాయకులు నీటి సరఫరా నిలిపివేయాలనే కుట్రతో ఈ విధమైన దుశ్చర్యకు ఒడిగట్టారని సర్పంచ్ విమర్శించారు. సామగ్రిని రాళ్లతో ధ్వంసం చేసి పైపుల్లో నీటి సరఫరా జరగకుండా ప్లాస్టిక్ కవర్లు అడ్డుగా వేశారన్నారు. టీడీపీ నాయకులు చేసిన పనితో గ్రామస్తులు తీవ్రంగా మండిపడుతున్నారన్నారు. ప్రజలు మంచినీటికి అవస్థలు పడకూడదని ఆగమేఘాల మీద స్టార్టర్ ఏర్పాటు చేసి పైపులైన్, ఇతర పనులు చేపట్టి యథావిధిగా ప్రజలకు తాగునీటి సరఫరా చేశామన్నారు. మంచినీటి పథకానికి చెందిన సామగ్రిని ధ్వంసం చేయడంపై సర్పంచ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.



స్టార్టర్‌ను రాళ్లతో ధ్వంసం చేసిన దృశ్యం

‘సీ-విజిల్’ ఫిర్యాదులను పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి సీ-విజిల్ యాప్‌లోవచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి/కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదేశించారు. గురువారం ఉదయం ఆమె ఆర్‌ఓలు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఆస్తుల ఆవరణాల్లో ఇప్పటికీ రాజకీయ నాయ కుల పోస్టర్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే వాటిని తొలగించాలన్నారు. సీవిజిల్ యాప్‌లో వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో పాణ్యం, పత్తికొండ నియోజకవర్గాల అధికారులు వెనుకబడి ఉన్నారని, ఇప్పటిరకు 33 శాతం ఫిర్యాదులకు మాత్రమే పరిష్కారాలు చూపారన్నారు. జిల్లా మొత్తంగా అన్ని రకాల ఫిర్యాదు లో 71 శాతం పరిష్కారమయ్యాయన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వలంటీర్లను తొలగించడంతోపాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు.

తనిఖీల్లో పట్టుబడిన మద్యం ధ్వంసం

కర్నూలు: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో తనిఖీల్లో పట్టుబడిన రూ.10.75 లక్షలు విలువ చేసే మద్యాన్ని అధికారులు ధ్వంసం చేశారు. కర్నూలు సెబ్ స్టేషన్ పరిధిలో గత సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పట్టుబడిన 120 కేసుల్లోని 1093.31 లీటర్ల నాటు సారా,1055.46 లీటర్ల అక్రమ మద్యాన్ని కర్నూలు మండలం పంచలింగాల గ్రామ శివా రులో రోడ్డుపై పారబోసి రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. కార్యక్రమంలో కర్నూలు అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ వి నోద్ కుమార్, కర్నూలు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



మద్యాన్ని ధ్వంసం చేసేందుకు సిద్ధం చేసిన సెబ్ అధికారులు

పెండేకల్లు జెడ్పీ హైస్కూల్ పీఎంశ్రీ పథకానికి ఎంపిక

తుగ్గలి: ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకానికి పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికైంది. ఈ పథకం ద్వారా ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులు కేటాయిస్తుంది. విడతల వారీగా విడుదలయ్యే నిధులతో విద్యార్థులకు అవసరమైన పరికరాలను సమకూర్చుకునే వెసులుబాటు ఇస్తుంది. స్మార్ట్ క్లాస్‌రూంలు, లైబ్రరీ, ల్యాబ్‌లు, క్రీడా సామాగ్రి తదితర వసతులను కల్పిస్తుంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యం పెంపు, ఫలితాల సాధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. పీఎం శ్రీ పథకానికి పాఠశాల ఎంపిక కావడంపై హెచ్‌ఎం నరేంద్ర, సర్పంచ్ హారిక, పీఎంసీ చైర్మన్ నాగరాజు హర్షం వ్యక్తం చేశారు.



బుడ్డాపై జనాగ్రహం

- వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగవంటూ మండిపాటు
- ఎన్నికల అధికారి, డీఎస్పీకి ఫిర్యాదు చేసిన వలంటీర్లు
- రక్షణ కల్పించాలని వినతి

ఆత్మకూరురూరల్: గ్రామ, వార్డు వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీశైలం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సేవలు అందిస్తున్న వారిపై అక్కసు వెళ్లగక్కడాన్ని తప్పుబడుతున్నారు. వలంటీర్ల వ్యవస్థ ఎంతో గొప్పదన్నారు. కరోనా విపత్తులో ప్రాణాలకు తెగించి విధులు నిర్వర్తించిన వలంటీర్లను బెదిరించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో వలంటీర్లు గురువారం బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై శ్రీశైలం నియోజకవర్గ ఎన్నికల అధికారిణి సుధారాణి, డీఎస్పీ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. తాము సాధారణంగా వీధుల్లో తిరిగినా దాడి చేయాలని బహిరంగ కార్యక్రమంలో బుడ్డా తన కార్యకర్తలకు సూచించిన విషయాన్ని వారు అధికారులకు వివరించారు. ఈ మేరకు ఆయన ప్రసంగించిన వీడియో కాపీని కూడా ఫిర్యాదుకు జతపరిచారు. డీఎస్పీ శ్రీనివాసరావు తన వద్దకు వచ్చిన వలంటీర్లకు ఎలాంటి భయం లేదని భరోసానిస్తూ స్థానిక అర్బన్ సీఐ లక్ష్మీనారాయణకు తగు ఆధారాలతో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో వలంటీర్లు సీఐకి ఫిర్యాదు చేశారు. ఆర్వో సుధారాణి వివిధ గ్రామాల నుంచి విడివిడిగా వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యకై పోలీసులను ఆదేశిస్తామని వలంటీర్లకు హామీ ఇచ్చారు.




ఎన్నికల అధికారిణి సుధారాణికి ఫిర్యాదు చేస్తున్న వలంటీర్లు

బుడ్డాకు ఎన్నికల కమిషన్ నోటీసు..

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బుడ్డాకు నియోజకవర్గ ఎన్నికల అధికారిణి సుధారాణి నోటీసు జారీ చేసినట్లు తెలిసింది. ఈ విషయంపై బుడ్డా తరుపు న్యాయవాదులు ఆర్‌వోను కలసి వివరణ అందించారు.


బెదిరించడం తగదు



సొంత కుటుంబీకులు కూడా పట్టించుకోని ముసలివాళ్లకు వలంటీర్లు ఎన్నో సేవలు అందిస్తున్నారు. తెల్లవారక ముందే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఇంటి వద్దకే బియ్యం వచ్చేలా చూస్తున్నారు. రాజకీయాలకు సంబంధం లేకుండా సేవలు అందిస్తున్న వలంటీర్లను టీడీపీ నాయకులు బెదిరించడం తగదు.

– చాకలి కొండమ్మ, పింఛన్‌దారు, నల్లకాల్వ

బుడ్డాపై చర్యలు తీసుకోవాలి



వలంటీర్లు అందిస్తున్న సేవలు గురించి తెలిస్తే బుడ్డా అలా మాట్లాడరు. బోదకాలు వ్యాధితో బాధపడుతున్న నాకు మా వలంటీర్లు ఎంతో సాయం చేశారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి నా పరిస్థితి వివరించి సీఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చులకు రూ. 5 లక్షలు ఇప్పించారు. నెలకు రూ. 5 వేల ప్రత్యేక పింఛన్ ఇప్పించారు. అలాంటి సేవాదృక్పథం ఉన్న వలంటీర్లను కొడతాననడానికి ఆ మహానుభావుడికి నోరెలా వచ్చిందో. ఎన్నికల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– మంగలి శివన్న, కురుకుంద

వలంటీర్లకు రక్షణ కల్పించాలి



టీడీపీ నాయకుడు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి బరితెగించి వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. టీడీపీ క్యాకర్తలను రెచ్చగొట్టేలా వ్యవహరించారు. పోలీసు అధికారులు వెంటనే వలంటీర్లకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలి. ఎన్నికల కోడ్‌ను బేఖాతరు చేస్తూ వ్యవహరించిన బుడ్డాపై చర్యలు తీసుకోవాలి.

– సుధాకరరెడ్డి, న్యాయవాది, ఆత్మకూరు

సంయమనం పాటించాలి



తెలుగు దేశం పార్టీ నేత బుడ్డా రాజశేఖర రెడ్డి ఆవేశాన్ని అదుపులో ఉంచుకుని సంయమనం పాటించాలి. దీర్ఘకాలం రాజకీయాల్లో ఉండాలనుకునే నాయకులు ప్రజల మన్ననలు పొందే విధంగా తమ ప్రసంగాలను మలుచుకోవాలి. వలంటీర్లపై ఆయన ఆగ్రహం పిచ్చుక మీద బ్రహ్మాస్త్రం లాంటిదే. ప్రజలు అన్నీ గమనిస్తారు. ఓటుతోనే గుణపాఠం చెబుతారు.

– శివశంకరరెడ్డి, జెడ్పీటీసీ, ఆత్మకూరు